# గెస్టు హౌస్ లో ఫోటోలు

**వసుంధర**

సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసర్ని. నా పేరు కేశవరావు. నెలకు మూడు వేలు పైగా జీతం. ఇంకా పెళ్ళి కాలేదు. కట్నాల బజార్లో నా ధర ప్రస్తుతానికి యాభైవేలు. నాన్నకు లక్ష రూపాయల ఆశ వుంది. నాకింకా పాతికేళ్ళే! బెండకాయ ఇంకా ముదరలేదు.

ఆఫీసు కార్లో ఆఫీసు పని మీద కాకినాడ నుంచి రాజమండ్రి బయల్దేరాను. డ్రైవరు రాజారావు సరదా అయిన మనిషి. హుషారుగా కబుర్లు చెబుతూ చలాకీగా డ్రైవు చేస్తున్నాడు. మధ్యాహ్నం భోంచేసి బయల్దేరాం. నలభై నిముషాలుగా కార్లో వున్నాం.

రాజానగరంలో ఓ అరగంట పనుందన్నాడు రాజారావు. అదేమిటో నాకుతెలుసు. అక్కడ అతడిక్కాబోయే భార్య వుంది. ఒక్కసారి ఆమెను చూసి వస్తాడు. అందులో ఆనందమేమిటో అతడికే అర్థం కావాలి. నాకింకా కాబోయే భార్య నిర్ణయం కాలేదు. వయసులో వున్న ఏ ఆడపిల్లను చూసినా అంతో ఇంతో నాకు మనసు చలిస్తూనే వుంటుంది.

రాజానగరం దగ్గర పడుతూంటే రాజారావులో ఉత్సుకత పెరుగుతోంది. దాన్నాపడానికే అన్నట్టు అప్పుడే రోడ్డుకు అడ్డంగా పేర్చిన రాళ్ళు...

రోడ్డు రిపేరీలో వుండి వుంటుంది. రాజారావుకి కోపంలో ఉక్రోషం కలిసింది. డైవర్షన్ తీసుకున్నాడు. అంతా గతుకులమయం. రాజారావు రోడ్డుపనివాళ్ళనీ, గవర్నమెంటు ఆఫీసర్లనీ, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలనీ యధేచ్ఛగా నిందించి, ''మీరేం మాట్లాడరేం?'' అన్నాడు.

''మనకే యిబ్బందీ రానప్పుడు కూడా ఇంత తీవ్రంగానూ ప్రభుత్వాలను విమర్శించగలిగితే దేశం ఇలాగుండదు'' అని నవ్వాను. ఆ నవ్వు గతుకుల్లో కలిసి వుండకపోతే రాజారావు నన్ను క్షమించేవాడు కాదు.

''వెధవరోడ్డు... ఇన్ని మెలికలు తిరుగుతుందేమిటి? అసలు మనమెక్కడికి పోతున్నాం?'' అని రాజారావు అంటే నేను చుట్టూ చూశాను.

ఆ గతుకుల బాటకు అటూ ఇటూ చెట్లే. బాట మెలికలు తిరిగి వున్న మూలానో ఏమో వెనక్కు చూసినా, ముందుకు చూసినా చెట్లే కనబడుతున్నాయి.

''మనం దారితప్పినట్లున్నాం. ఒక్కసారి కారాపు'' అన్నాను.

''దారెలా తప్పుతాంసార్! జస్ట్ డైవర్షన్ తీసుకున్నాం అంతే!'' అంటూ కారాపి డోరు తెరిచి దిగబోయాడు రాజారావు. కానీ ఏమయిందో అతడు విరుచుకుని వెనక్కు పడిపోయాడు. డోరు దానంతటదే మూసుకుంది.

''ఏమయింది రాజారావ్!'' అన్నాను కంగారుగా.

రాజారావు మాట్లాడలేదు. అతడికి స్పృహ తప్పిందని నాకర్థమయింది. ఆ పరిస్థితుల్లో డ్రైవింగు రాని నేనేం చేయాలో అర్థంకాక ముందు ప్రయత్నంగా కారు దిగాను. అంతే!

నా కళ్ళు జిగేల్మన్నాయి.

ఎక్కణ్ణించి వచ్చిందో ఎలా వచ్చిందో తెలియదు. అప్పుడే ప్రత్యక్షమైన అప్సరసలా వుందా యువతి. ఆమెను చూస్తూ నేను తాత్కాలికంగా రాజారావును మరిచిపోయాను.

ఆమె నన్ను చూసి చిరునవ్వుతో, ''ఎవరు మీరు?'' అంది.

ఆ నవ్వుకు, ఆ గొంతుకు పరవశిస్తూనే నా గురించి చెప్పుకున్నాను.

''ఏమయింది?'' అందామె మళ్ళీ.

అప్పుడు రాజారావు గుర్తుకొచ్చాడు నాకు. జరిగింది చెప్పాను.

''ఈ పక్కనే మా యిల్లు. అతన్నక్కడికి తీసుకెడదాం'' అందామె.

మరాలోచించకుండా కారుడోరు తెరిస్తే రాజారావక్కడ లేడు. ''రాజారావ్!'' అన్నాను. నా గొంతు చెట్ల మధ్య ప్రతిధ్వనించింది.

''మీరు పొరబడి వుంటారు. అతడు కారు దిగి పరిసరాలు చూడ్డానికి వెళ్ళి వుంటాడు. రండి, మా ఇంటికి వెడదాం'' అందామె.

''ఈలోగా రాజారావు వస్తే?'' అన్నాను.

''కారు తాళాలు మీ దగ్గరుంచుకోండి. అతడూ వెతుక్కుంటూ మా యింటికే వస్తాడు'' అందామె వెనక్కు తిరిగి.

మంత్రముగ్ధుడిలా నేనామెననుసరించాను. నాకు పరిసరాలు, దారి తెలియడంలేదు. ఆమె కట్టిన పాము కుబుసం వంటి తెల్లని చీర, నాట్యంలా ఆమె నడక, లయబద్ధంగా ఊగే ఆమె పిరుదులు, వాటిపై బుసకొట్టే నాగువంటి నల్లని జడ- ఇవి మాత్రమే నాకు తెలుస్తున్నాయి.

అలా ఎంతసేపు నడిచామో, చివరికో ఇంట్లో ప్రవేశించాం.

చూడ్డానికదో గెస్టుహౌసులాగుంది. మేము ప్రవేశించిన హాల్లో రెండు సోఫాసెట్లున్నాయి. ఇద్దరం ఎదురెదురుగా సోఫాల్లో కూర్చున్నాం.

''ఇదా మీ యిల్లు?'' అన్నాను.

ఆమె అవుననలేదు. కాదనలేదు. మందహాసం చేసింది.

''మీ పేరు?'' అడిగాను.

''మీకంటే చిన్నదాన్ని. నువ్వనండి, చాలు!''

''అయితే నువ్వూ నన్ను మీరనకు''

''అంటాను. ఎందుకో తర్వాత మీకే తెలుస్తుంది'' అంటూ నవ్విందామె.

''ఈ ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయా, లేక ఈ హాలు నీ నవ్వుల వెలుగులతో నిండిపోయిందా?'' అన్నాను.

ఆమె నవ్వి, ''ఇది పట్టపగలు'' అంది.

''కాదు. ఇది అర్ధరాత్రి. నీ నవ్వులతో రాత్రి పగలయింది.''

''రాత్రిళ్ళు నేను నవ్వను'' అందామె గంభీరంగా.

''ఎందుకని?'' అడిగాను ఆశ్చర్యంగా.

''నేనే రాత్రిని. నన్ను చూస్తూ నేనెలా నవ్వగలను?''

''నీ మాటలు నాకర్థం కావడంలేదు''

''ఇందాకా నా పేరడిగారు కదూ, నా పేరు నిశారాణి. అమావాస్యనాడు పుట్టానని అమ్మా, నాన్నా నాకా పేరెట్టారు'' అందామె నవ్వుతూ.

''వాళ్ళిప్పుడింట్లో వున్నారా?''

ఆమె అదోలా నా వంక చూస్తూ, ''ఇప్పుడు యింట్లో వున్నది మీరూ, నేనూ, అంతే!'' అంది.

ఆ చూపులకు నా వళ్ళు జలదరించింది.

''మిమ్మల్ని నేనెందుకు పిలిచానో తెలుసా?'' అందామె మళ్ళీ.

తల అడ్డంగా ఊపాను కానీ ఊగుతున్న ఆ తలలోని రెండు కళ్ళూ నిశ్చలంగా ఆమెనే చూస్తున్నాయి. వాటిలో ఆశ వుందని నాకు తెలుసు.

"మనం పెళ్ళి చేసుకుందాం" అందామె.

ఉలిక్కిపడ్డాను.

ఆమె నవ్వింది, "నేను జోక్ చేయడం లేదు. మనం పెళ్ళి చేసుకుందాం. ఈ పెళ్ళి మనమిద్దరం ఒకరంటే ఒకరు ఇష్టపడి చేసుకుంటున్నది. కుల మతాల అడ్డుగోడలు, వరకట్న పిశాచి మన పెళ్ళికి ప్రతిబంధకాలు కావు. శకుంతల దుష్యంతుణ్ణి నమ్మిన విధంగా నేను మిమ్మల్ని నమ్ముతాను. నా సర్వస్వం మీకు సమర్పించుకుంటాను. ఆ తర్వాత నేను శకుంతలలా మీ వెంట పడను. కానీ నేను కంటపడిన వెంటనే మీరు నన్ను భార్యగా ఆదరించాలి. అంతే!"

నాలో ఆవేశం రగిలింది. చటుక్కున లేచి వెళ్ళి ఆమె పక్కన కూర్చున్నాను. ఆమె వళ్ళు నాకు తగులుతూంటే నాలో కోర్కె పుడుతోంది.

"పెళ్ళికి మీరు సిద్ధమేనా?" అందామె.

"ఊ" అన్నాను.

"ఇంత వెంటనే పెళ్ళికొప్పుకున్నారు. మీరు అతి మంచివారో, మహా మాయగాడో అయివుండాలి" అంటూ నవ్విందామె.

నేనామెను దగ్గరగా తీసుకున్నాను. ఆమె మృదువుగా నన్ను విడిపించుకుని దూరంగా జరిగి టీపాయ్ మీదున్న టేపు రికార్డరు స్విచ్ నొక్కింది.

అంతే! వేదమంత్రాలతో పెళ్లితంతు ప్రారంభమయింది.

నేను అభ్యంతరపెట్టలేదు. శాస్త్రోక్తంగా మా పెళ్ళి జరిగిపోయింది.

అలంకరించి సిద్ధంగా వున్న గదిలో మా శోభనం జరిగింది. స్త్రీ స్పర్శ ఎరుగని తల్లిదండ్రుల చాటు బిడ్డనైన నేను... అప్పుడు మొదటిసారిగా మగవాడినని పించుకున్నాను.

ఒక పురుషుడు, స్త్రీ కలిసి జీవించడం కోసమే ఈ సృష్టి నిర్దేశించబడిందని అప్పుడు నేను గ్రహించాను. కట్నం ధర పెంచడం కోసం పెళ్ళిని వాయిదా వేస్తూ నేనేం పోగొట్టుకుంటున్నానో అప్పటిదాకా నాకు తెలియలేదు.

ఇప్పుడయితే ఆమెను వదలడం నా వల్లనవుతుందా అనిపిస్తోంది. అదే మాట తనతో అంటే, "నన్ను పొందానని మీరనుకుంటున్నారు. అది మీ భ్రమ. ఈ భ్రమే మిమ్మల్ని సంతోషంలో ముంచివేస్తోంది. వాస్తవం భ్రమను మించి సుఖాన్నిస్తుంది మీకు. ఆ సుఖానికి దూరం కాకూడదనుకుంటే నన్ను మీరు మోసం చెయ్యరు" అందామె.

మోసం చెయ్యకూడదనే వుంది నాకు. కానీ ఆ ఇంట్లోంచి బైటపడ్డాక నాన్న బెదిరించి ఈమెను ఇంటికి రప్పించగలనా అన్న అనుమానం అప్పుడే నాలో తలెత్తుతోంది. అందుకని ఇక్కడే మరో రెండు రోజులుండి ఆమెను తనివితీరా అనుభవించి పూర్తిగా మోజు తీర్చుకుని అప్పుడు వెళ్ళిపోతే అన్నివిధాలా మంచిది.

"నేనిక్కడ ఇంకా కొద్ది రోజులుంటాను. ఇప్పుడే నిన్ను వదిలి వెళ్ళలేను."

"ఎందుకని?" అందామె.

"మన అనుబంధం క్షణికం కాకూడదు. కొద్ది రోజులుంటే నీవు నా మనసంతా నిండిపోతావు. అప్పుడు నిన్ను కావాలన్నా మోసం చేయలేను. ఇప్పుడే వెళ్ళిపోతే నిన్ను మోసం చేస్తానేమోనని భయంగా వుంది" అన్నాను.

"నన్ను మోసం చేసి మీరు బ్రతక లేరు" అందామె.



నేనామె వంక ఆశ్చర్యంగా చూశాను. దేవకన్యలా కనిపించే ఆమె కన్నుల్లో పిశాచి కోపం కనబడింది. అప్పుడు నా ఆశ్చర్యం భయంగా మారింది.

"అటు చూడండి" అందామె.

చూశాను. గోడలకు కొన్ని ఫోటోలు వ్రేలాడుతున్నాయి.

"మొదటి ఫోటో భాస్కర్‌ది. నన్ను చూడ్డానికి వచ్చిన పదకొండో వరుడు. పది పెళ్ళిచూపుల తర్వాత విసిగిపోయిన నేను కాబోయే వరులనిలా కలుసుకోవడం అతడితోనే ప్రారంభించాను. నాతో పొందు వాస్తవమని భ్రమించి నా హెచ్చరికను వాస్తవంలో అలక్ష్యం చేసి జీవితాన్నే భ్రమ చేసుకుని అదిగో, అలా ఫోటోలో వ్రేలాడుతున్నాడు. ఆ రెండో ఫోటో భానుమూర్తిది. మూడు విజయ్. నాలుగు బ్రహ్మానందం. అయిదు శంకరం ... ..."

ఆమె చెప్పుకుపోతోంటే నాలో భయం పుట్టి ఆమెను మధ్యలో ఆపి, "అసలు నువ్వు ఎవరు? ఇదంతా ఏమిటి?" అన్నాను.

"వరకట్న పిశాచపు కరకు కోరలకు గురై విలపించే కన్నెపిల్లల ఆర్తనాదాల్లోంచి పుట్టిన నిశారాణిని నేను. వరకట్న పిశాచానికి ఆశ్రయమిచ్చే ప్రతి మగాణ్ణీ యిలా ఫోటోలోకి పంపడం నా ఆశయం" అంటూ అదోలా క్రూరంగా నవ్విందామె.

"అలా నవ్వకు. అది నీకు నప్పలేదు..." అన్నాను కంగారుగా.

"నప్పని నవ్వు నా ముఖానికి పులుముతున్నది మగాడు. మీరలాంటి మగాడు కాకూడదని నా కోరిక" అందామె.

నాకు అక్కడిక వుండాలనిపించలేదు, "వస్తాను. మనం మళ్ళీ కలుసుకుందాం" అంటూ అక్కణ్ణించి కదిలాను.

"వెళ్ళే ముందు బల్ల మీద ఆ ఫోటో చూసి వెళ్ళండి" అందామె.

దూరంగా డైనింగ్ టేబిల్ మీద బోర్లించి వున్నాయి రెండు ఫోటోలు. నేను అప్రయత్నంగా అంతవరకూ నడిచి ఓ ఫోటో తిరగేసి చూసి ప్రాణ్పడి పోయాను. అది నా కజిన్ విశ్వనాథానిది. వాడికీవేళ రాజమండ్రిలో పెళ్ళిచూపులు.

"ఈ ఫోటో యిక్కడి కెందుకు వచ్చింది?" అన్నాను.

"అదక్కడే అలాగుంటుందో లేక గోడకు వ్రేలాడుతుందో ఈ రాత్రికి తేలిపోతుంది!" అందామె ఇంకా క్రూరంగానే నవ్వుతూ.

అప్పుడామె మృదువైన గులాబికన్నెలా కాక బుస కొట్టే నాగకన్యలాగుంది. ఆ అపురూప సుందరినలా మార్చిన ఘనత మగాడిదేనా?

ఆలోచిస్తూనే రెండో ఫోటో మీద చేయి వేశాను.

"అది మీరు చూడకూడదు" అందామె. కానీ అప్పటికే ఫోటో తిరగేశాను. అంతే! నా నరనాడులూ స్తంభించిపోయాయి.

అది నా ఫోటో!

మరి అక్కడికెలా వచ్చిందో!

ఆమె నన్ను సమీపించి మృదువుగా నా చేయి నిమురుతూ, "భూత భవిష్యద్వర్తమానాలు తెలుసుకోవడం అందరికీ మంచిది కాదు. తెలుసుకున్న అందరికీ ఆ జ్ఞానాన్ని మంచికి ఉపయోగించుకోవడం రాదు. ఇక బయల్దేరండి. మీ రాక కోసం ఎదురు చూస్తుంటాను" అంది.

"వెడతాను. కానీ వెంటనే వస్తాను - నిన్ను మా యింటికి ఆహ్వానించడానికి" అన్నాను ఆవేశంగా. ఆ ఆవేశం భయంలోంచి పుట్టిందని నాకు తెలుసు.

ఆమె నవ్వింది. ఈ సారి ఆ నవ్వులో జాలి వుంది. "మీ మనసు మంచిదైతే నేనే మళ్ళీ మీకు కనిపిస్తాను. కానీ మీరు మాత్రం నన్ను కలుసుకోలేరు. ఈ హాల్లోంచి అడుగు బైటపెట్టేక వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళండి."

ఇదీ ఆమె నాకిచ్చిన సందేశం.

నేను హాల్లోంచి బైట అడుగుపెట్టగానే భళ్ళుమన్న చప్పుడులో నా వెనుకే తలుపులు మూసుకున్నాయి. అప్రయత్నంగా వెనక్కి తిరిగి చూస్తే...

ఏముందక్కడ?

గెస్టు హౌసు లేదు. దాని చుట్టూ పూల తోట లేదు.

అదో రోడ్డు. అటూ యిటూ చెట్లు...

ఎదురుగా చూస్తే కారు.

కారును సమీపించి ఫ్రంట్ డోర్ తీశాను. రాజారావింకా స్పృహ లేకుండా పడి వున్నాడు.

"రాజారావ్!" అన్నాను.

ఉలిక్కి పడి లేచాడు రాజారావు.

*** *** ***

రాజమండ్రి చేరుకునే సరికి సాయంత్రం అయిదయింది. దారి పొడుగునా నేను, రాజారావు జరిగింది చర్చించుకున్నాం. నిశారాణి అనుభవాలు నేనతడికి చెప్పలేదు. అతడు రాజానగరంలో ఆగలేదు.

రాజానగరానికి ముందు రోడ్డుకు అడ్డంగా రాళ్ళు పెట్టి వుండడం మేము తప్ప ఎవరూ గమనించలేదు.

డైవర్షన్ ఎందుకు తీసుకున్నామో మాకే తెలియడం లేదిప్పుడు.

నేను వెళ్ళాల్సిన ఆఫీసు నాలుగున్నరకల్లా మూసేస్తారు. మళ్ళీ రేపు ఉదయం తొమ్మిదింటికే తెరుస్తారు. అందుకని మా బంధువులింటికి వెళ్ళాను.

అక్కడ విశ్వనాథం తలిదండ్రులున్నారు. అప్పుడే పెళ్ళి చూపులై తిరిగొచ్చారు.. విశ్వనాథం దారిలో ఎవరో స్నేహితులింటికని వెళ్ళాడుట.

అడక్కుండానే విశ్వనాథం తండ్రి నాకు వివరాలు చెప్పాడు.

"మేమేం లక్షలడగలేదు. పాతిక వేలు కట్నమడిగాం. ఓ వంద మంది ముఖ్య బంధువులకి బట్టలు పెట్టాలన్నాం. పెళ్ళి గ్రాండుగా చేయాలన్నాం. దీనికి



'జగదేకవీరుడు-అతిలోకసుందరి' నిర్మాత, దర్శకులకు క్షమాపణలతో!

10-8-90

బదులుగా పిల్ల తండ్రి బేరమాడలేదు. బతిమాలలేదు. పదివేలు కట్నమిచ్చి రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేస్తానన్నాడు. ఇష్టమైతే ఒప్పుకోండి, లేకుంటే లేదన్నాడు. ఇలా తెగేసి చెబితే ఆ పిల్లకు పెళ్ళవుతుందా?'' అన్నాడాయన.

''విస్సి ఏమన్నాడు?'' అన్నాను.

''వాడికి పిల్ల నచ్చింది. అంతే! నిర్ణయం నాది కానీ వాడిది కాదు కదా!''

''అయితే ఇది వదులుకున్నారా?'' అన్నాను.

''వదులుకున్నది వాళ్ళు, మేము కాదు'' అంది విశ్వనాథం తల్లి.

నేను మాట్లాడలేదు. గెస్ట్ హౌస్‌లో నిశారాణి మాటలు, గది గోడలకు వ్రేలాడుతున్న ఫోటోలు గుర్తు కొచ్చాయి.

ఇంతలో ఎవరో హడావుడిగా వచ్చారు.

''విశ్వనాథాన్ని లారీ గుద్దేసింది. హాస్పిటల్లో చేర్పించి ఇలా వస్తున్నాను'' అన్నాడావ్యక్తి. అతడు విశ్వనాథం స్నేహితుడు.

డైనింగ్ టేబిల్ మీద బోర్లించి వున్న ఫోటోను తిరగేసినప్పుడు, ''అదక్కడే అలాగుంటుందో లేక గోడకు వ్రేలాడుతుందో ఈ రాత్రికి తేలిపోతుంది'' అంది నిశారాణి బసకొట్టే నాగకన్యలా!

ఆ రాత్రికి విశ్వనాథం ప్రాణాలు అనంతవిశ్వంలో కలిసిపోయాయి.

*** *** ***

మర్నాడు ఉదయం నేను విశ్వనాథం పెళ్ళి చూపులకు వెళ్ళిన ఇంటికి వెళ్ళాను. పెళ్ళి కూతురు తండ్రి జగన్నాథరావు నన్ను పలకరించి వివరాలడిగాడు.

''నేను విశ్వనాథం స్నేహితుణ్ణండి!'' అన్నాను.

ఆయన ముఖం వికసించింది. ''ఏదైనా మంచి కబురు తెచ్చావా బాబు!'' అన్నాడు.

''ఒక్కసారి మీ అమ్మాయిని పిలవండి. ఆమెకే చెబుతానాకబురు. మంచి చెడ్డలనామే నిర్ణయిస్తుంది'' అన్నాను.

ఏమనుకున్నాడో కానీ ఆయన ''సంధ్యా!'' అని కేక పెట్టాడు.

కాసేపట్లో ఓ అమ్మాయి నెమ్మదిగా అక్కడకు వచ్చింది. ఆమెను చూస్తూనే, ''నిశారాణి'' అన్న మాటలు అప్రయత్నంగా నా నోట వెలువడ్డాయి.

''నిశారాణి ఎవరు?'' అన్నాడు జగన్నాథరావు.

ఆ అమ్మాయి అమాయకంగా నా వంక చూస్తోంది.

''వరకట్న పిశాచపు కరకు కోరలకు గురై విలపించే కన్నె పిల్లల ఆర్తనాదాల్లోంచి పుట్టిన నిశారాణిని నేను'' అన్న మాటలు నా చెవిలో ప్రతిధ్వనించాయి. సంధ్యకు తెలియక పోవచ్చుకానీ ఆమె నిశారాణికి ప్రతిరూపం.

వస్త్రాపహరణం జరిగేక జ్వలిత మనస్కురాలై ద్రౌపది యివ్వబోయే శాపానికి గాంధారి భయపడి ఆమె ఏమడిగినా యివ్వడానికి సిద్ధపడింది.

వస్త్రాపహరణాన్ని మించిన ఘోరావమానాన్నీనాడు ప్రతి మగవాడూ కలుగజేస్తూంటే ప్రతి కన్నె పిల్లలోంచీ ఓ నిశారాణి పుట్టి గెస్టు హౌసును కట్టి ఫోటోలు వ్రేలాడదీసిందంటే ఏదో ఒక రోజున సమస్త పురుష జాతి అలనాటి సర్పయాగంలో పాముల్లా మలమల మాడి నశించక తప్పదు.

''ఏమిటో చెబుతానన్నావు?'' హెచ్చరించాడు జగన్నాథరావు.

''నిన్న రాత్రి విశ్వనాథం యాక్సిడెంట్లో మరణించాడు'' అన్నాను.

''ఆ!'' అని తెల్లబోయి ''ఇదా నువ్వు తెచ్చిన మంచి కబురు!'' అన్నాడాయన.

''కాదు. నేను మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను...'' అన్నాను.

ఆ తండ్రీ కూతుళ్ళిద్దరూ తెల్లబోయారు.

''నాకు కట్నం వద్దు. పెళ్ళి రిజిస్ట్రారాఫీసులో చేయండి''

జగన్నాథరావు ఆశ్చర్యానందాలు అనుమానంలోకి మారాయి. ఆ అనుమానం కళ్ళలోంచీ గొంతులోకి దిగి ''నీ యీ నిర్ణయానికి కారణం తెలుసుకోవచ్చా?'' అన్నాడు.

''నన్ను పొందానని మీరనుకుంటున్నారు. అదంతా మీ భ్రమ. వాస్తవం భ్రమను మించి సుఖాన్నిస్తుంది మీకు'' అన్న నిశారాణి మాటలు నా చెవుల్లో గింగిరుమంటున్నాయి.

* * *

నా పెళ్ళి నన్ను నా తలిదండ్రులకు దూరం చేసింది. కానీ సంధ్యతో కాపురం నాకామెతో తప్ప వేరెవరితో నిమిత్తం లేదనిపించేలా చేస్తోంది. అయితే నేనామెకు నిశారాణి అనుభవం గురించి చెప్పలేదు.

ఆర్నెల్ల కాపురం తర్వాత మా పొరుగింట్లో పెళ్ళి చూపులైతే మమ్మల్నీ పిలిచారు.

వరుడితోపాటు అతడి అక్క, బావ, తలిదండ్రులు వచ్చారు.

తంతు అవుతూండగా తలవంచుకుని పెళ్ళి కూతురు వచ్చింది. కాబోయే అత్తగారు తలెత్తమంది.

ఆమె తలెత్తగానే ''నిశారాణి'' అన్నాడు వరుడు అప్రయత్నంగా.

''నిశారాణి ఎవరు?'' అన్నాడు వధువు తండ్రి.

ఒకసారి ఆ పేరు నా నోట విన్న సంధ్య నా వంక ప్రశ్నార్థకంగా చూసింది. నేనామెను పక్కకు పిలిచి ''ఈ పెళ్ళి కట్నం లేకుండా జరుగుతుంది'' అన్నాను.

''నిశారాణి ఎవరు?'' అంది సంధ్య.

''ఎవరేమిటి? తలిదండ్రుల గుండెల మీద కుంపటిగా మండే గుండెలలో వేగిపోయే ప్రతి వధువూ నిశారాణి! ఒకనాడు నువ్వు...ఈ రోజు ఈమె! ఈ సత్యం నేనూ ఇప్పుడే గ్రహించాను'' అన్నాను.

నా మాటలు సంధ్యకు అర్థం కాలేదు కానీ పొరుగింటి పెళ్ళి కట్నం లేకుండా సింపుల్‌గా జరిగిపోతే ఆశ్చర్యపడింది.

ఆ తర్వాత నుంచి కట్నం ఆశతో మథన పడే ప్రతి యువకుడూ నాకు గెస్టు హౌసులో వ్రేలాడబోయే ఫోటోలా కనిపించసాగారు. ●

## అపకారానికి-ఉపకారం

1946లో ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్యను ప్రారంభించింది. కలకత్తా నగరంలో భీభత్స వాతావరణం యేర్పడింది. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా హత్యాకాండ, ప్రతిహింసాకాండ కొనసాగకుండా అరికట్టని పక్షంలో భారతదేశ స్వాతంత్ర్యం కలగానే వుండిపోతుంది అని ప్రజలలో భీతావహాన్ని తొలగించి, వారిలో ఆత్మ విశ్వాసం పెంపొందింపచేయడానికి, హింసకాండకు తలపడినవారిలో పశ్చాత్తాప భావం కలిగించడానికి, తిరిగి రెండు వర్గాల ప్రజలు కలిసి మెలసి జీవించడానికి వీలుగా మత కలహాలు జరిగిన ప్రతీ గ్రామంలో తన ఆశ్రమానికి చెందిన ఒకరిని గాంధీజీ నియమించారు. తమ ఆధీనంలో వున్న గ్రామంలోని ఏ ఒక్కరికి ముప్పు వాటిల్లినా అహింసా పద్ధతిలో తమ ప్రాణాలను సైతం అర్పించడానికి ప్రతిజ్ఞ చేశారు.

తన ఆశ్రమంలో వున్న సుశీలానయ్యర్‌ను గాంధీజీ శిబిరానికి రెండు మైళ్ళ దూరంలో చంగీర్ గావ్ అనే గ్రామంలో నియమించాడు. ఒకప్పుడు బాగా వున్న ఈ గ్రామం శిథిలమైంది. ఎటు చూచినా అగ్ని జ్వాలలకు ఆహుతి అయిన పాకలు, ఇళ్ళు, వంటకుప్పలు కనిపించాయి. ఇళ్ళన్నీ ధ్వంసం చేశారు. కాలిపోయిన బూడిద నుండి ఇనుప రేకులను, కడ్డీలను బయటికి తీసి తాత్కాలిక శిబిరాలను ఏర్పాటుచేయడానికి గ్రామస్థులు ప్రయత్నిస్తున్నారు.

సుశీలానయ్యర్ గ్రామం అంతా వెదికితే ఒక పెద్ద ఇంటిలో చిన్న గది మాత్రం చెక్కు చెదరకుండా వున్నది. దానిని తన నివాసంకు వినియోగించుకున్నారు. ఆగ్రామంలో డాక్టర్‌గా చెలామణి అవుతున్న ఒక కాంపౌండర్ నయ్యర్‌కు సహాయపడడానికి ముందుకువచ్చాడు. కాంపౌండర్ చిన్న ఇల్లు కూడా సురక్షితముగా వుండిపోయింది. కొందరు దుండగులు సాయుధులైవచ్చి మొదట కాంపౌండర్ ఇంటిపై పడి లూటీ చేయడం ప్రారంభించి ఇంటిలోని బాపూ చిత్రపటాలను ధ్వంసం చేసి చేతికి దొరికినవి తీసుకొని వెళ్ళనారంభించారు. ఇంతలో పగిలిపోయిన గాజుముక్క దుండగుల ముఠా నాయకుని కాలికి గ్రుచ్చుకొని రక్తం కారడం ప్రారంభించింది. అప్పటికే కాంపౌండర్ వైద్యశాల నగం విధ్వంసమయినప్పటికీ, తనకు జరిగిన అపకారాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ముందుకు వచ్చి అతని కాలికి కాంపౌండర్ బ్యాండేజి కట్టాడు. అపకారానికి ఉపకారం చేయడం దుండగుల నాయకునకు ఆశ్చర్యం కలిగించింది. వెంటనే వారు మనస్సు మార్చుకున్నారు. కాంపౌండర్ ఇంటిపై దాడి చేయరాదని తన వాళ్ళను శాసించి ముఠా నాయకుడు వెళ్ళిపోయాడు. అందుచేతనే గ్రామంలో కాంపౌండర్ ఇల్లు సురక్షితంగా వుండిపోయింది.

గాంధీజీ గారు ముందు చేసిన ఆజ్ఞ ప్రకారం సుశీలా నయ్యర్ కాంపౌండర్ సహాయంతో గ్రామంలోని రెండు వర్గాలలోని రోగులకు చికిత్స చేయడం ప్రారంభించి, అహింసా పద్ధతిలో తన ప్రాణాలను సైతం అర్పించడానికి వెనుకాడలేదు.

— భీమరశెట్టి శ్రీనివాసరావు